
ప్రాణాలకు ఖరీదు

- నేరాలు చేసినా తప్పించుకు తిరుగుతున్న బడాబాబులు
- చాలా ఘటనల్లో పోలీసుల వైఖరి వివాదాస్పదం

న్యూస్‌టుడే, గద్వాల, మహబూబ్‌నగర్ నేర విభాగం

ఏదో ఒక పనిచేసుకుని జీవనం సాగించే బీదాబిక్కీ ప్రజలు అన్యాయానికి, అఘాయిత్యానికి గురైతే అండగా నిలవాల్సిన వ్యవస్థలు సరిగా స్పందించడం లేదు. నిందితులు రాజకీయ పలుకుబడితో పోలీసులను ఉపయోగించి, తప్పుడు కేసులు పెట్టి, భయపెట్టి నోరెత్తకుండా చేస్తున్నారు. బాధితులకు ఎంతో కొంత ముట్టజెప్పి వారి ప్రాణాలకు కూడా ఖరీదు కడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో అత్యాచార ఘటనలు, బాలికల ఆత్మహత్యలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం వికటించి చనిపోవటం, రోడ్డు ప్రమాద మరణాలు నిత్యకృత్యమవుతున్నాయి. బాధితుల్లో ఎక్కువ మంది నిరుపేదలే. ఘటనలపై ఎంత మంది గొంతెత్తినా, పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు వచ్చినా చివరికి డబ్బు, రాజకీయ పలుకుబడితే పైచేయి అవుతోంది. కసులు నీరు గారుస్తుండటం పరిపాటిగా మారింది. తాజాగా గద్వాల జిల్లాలో జరిగిన ఘటన చర్చనీయాంశమవుతోంది.



మచ్చుకు కొన్ని ఘటనలు..

- గద్వాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక చేయని నేరం మోపారని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎన్ని విమర్శలు వచ్చినా పోలీసులు అడుగు ముందుకు వేయలేదు. కీలక ప్రజాప్రతినిధి జోక్యంతోనే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి కుటుంబానికి పెద్దఎత్తున డబ్బు ఆశ జూపినట్లు ఆరోపణలు వచ్చాయి.
- ధరూరు మండలంలో కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎన్నో అనుమాలు ఉన్నా కుటుంబ సభ్యులను ఒప్పించి చేసి ప్రమాదవశాత్తు చెరువులో మునిగినట్లుగా లెక్కలు గట్టి కేసును నీరుగార్చే ప్రయత్నంలో పెద్ద మనుషులు సఫలయ్యారు.
- గద్వాల మండలంలో ఓ యువకుడు పోలీసులకు ఫిర్యాదు ఇప్పించారు.
- కేటీదొడ్డి మండలం ఉమిత్యాలలో యువకుల వేధింపుల కారణంగా ఓ బాలిక అత్యహత్యకు పాల్పడింది. సామాజిక మాధ్యమాలు, ప్రతికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు వచ్చాక గానీ పోలీసులు స్పందించలేదు. చివరికి ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో కూడా బాలిక ప్రాణానికి వేధించటంతో అవమాన భారంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పరువుపోతుందని కుటుంబ సభ్యులు ఇతర కారణాలు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడు మాత్రం దర్జాగా తిరుగుతున్నాడు.
- గట్టు మండలంలో పేలుళ్లతో ఇతర రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతిచెందితే కంపెనీ ప్రతినిధులపై నామమాత్రంగా కేసులు నమోదు చేశారు.
- నాగర్‌కర్నూల్‌లో ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందగా ఇసుక మాఫియా మొత్తం రంగంలోకి దిగి వ్యవహారాన్ని చక్కబెట్టారు.
- దేవరకద్ర మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలే స్వయంగా ఈ విషయాన్ని చెప్పింది. అయినా ఒక్కరిపైనే కేసు నమోదైంది.
- కొల్లాపూర్ మండలంలోని ఓ తండాలో చెంచు మహిళను తీవ్రంగా కొట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. చాలామందిపై ఆరోపణలు ఉన్నా, దాడి వీడియోలు బయటకు వచ్చినా కేసు మాత్రం నలుగురిపైనే నమోదు చేశారు.

ఆసుపత్రి మరణాలపై కేసులేవీ..

- గద్వాలలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పది నెలల వ్యవధిలో వైద్యం వికటించి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వైద్యులు బాధిత కుటుంబాలకు ఎంతో కొంత సొమ్ము ముట్టజెప్పి ఆస్పత్రులపై కేసులు కాకుండా చూసుకున్నారు.
- ఈ ఏడాది జులైలో ఓ మహిళ కడుపు నొప్పితో నాగర్‌కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రాగా వైద్యం వికటించి మృతి చెందింది. బంధువులు ఆందోళనకు దిగటంతో కొంత డబ్బు ముట్టచెప్పి వైద్యులు తమపై కేసు కాకుండా చేసుకున్నారు.
- నాగర్‌కర్నూల్‌లోని మరో ఆస్పత్రికి వచ్చిన మహిళకు రక్తం తక్కువగా ఉన్నా ఆపరేషన్ చేయటంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రి ముందు ధర్నాకు దిగటంతో కొంత డబ్బిచ్చి నోరు నొక్కేశారు.

కల్తీ కల్లు మరణాలు ఎన్నో..: మహబూబ్‌నగర్‌లో కల్తీ కల్లు తాగి చాలా మంది ఆసుపత్రి పాలయ్యారు. ముగ్గురు మృతిచెందినా అనారోగ్యమే కారణమని కొట్టిపారేస్తూ కల్లు డిపోల నిర్వాహకులపై కేసు నమోదు కాలేదు. మానవపాడు మండలంలోని ఓ గ్రామంలో కల్తీ కల్లు తాగి ముగ్గురు మృతిచెందినా ఇలాగే చేశారు. బల్మూరు మండలం, జడర్ల పరిసరాల్లో కల్తీ కల్లు తాగి కొందరు మృతిచెందినా కేసులు నమోదు కాలేదు.

ఈనాడు
జోగులాంబ గద్వాల

పోటీ పరీక్షలకు అందుబాటులో పుస్తకాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్యామ్‌సుందర్‌తో ముఖాముఖి

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: పోటీ పరీక్షల కోసం చదివే విద్యార్థులకు ప్రత్యేక పుస్తకాలు తెప్పిస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. పంచాయతీల నుంచి పన్ను సక్రమంగా వసూలైతే గ్రంథాలయాల ఆధునికీకరణకు అవకాశముంటుందంటూ పలు విషయాలను 'న్యూస్‌టుడే'తో ముఖాముఖిగా ఆయన పంచుకున్నారు.



? **పోటీ** పరీక్షల నేపథ్యంలో గ్రంథాలయాలకు వస్తున్న నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని గ్రూప్-1, గ్రూప్-2 లాంటి మెటీరియల్ ఏమైనా అందుబాటులో ఉంచారా?

✔ గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు సంబంధించి ఎక్కడా లేని అడ్వాన్స్‌డ్ పుస్తకాలు తెప్పించాం. పాఠకులు కోరుకునే పుస్తకాలన్నీ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాం.

? **ఇప్పటివరకు** ఎంత సెస్ బిల్లు వసూలు చేశారు?

✔ ప్రస్తుతం రూ.32 లక్షలు వసూలైంది. మున్సిపాలిటీల ద్వారా ఎక్కువ మొత్తం వస్తోంది. గ్రామ పంచాయతీల ద్వారా తక్కువ మొత్తంలో సెస్ జిల్లా నిధికి జమచేయడం జరుగుతోంది.

? **సెస్** బిల్లుతో గ్రంథాలయాల అభివృద్ధి కోసం ఏమైనా కొనుగోలు చేశారా?

✔ గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు, నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని అన్నిరకాల అప్‌డేట్ వర్షన్ పుస్తకాలు తెప్పిస్తున్నాం. కేవలం పుస్తకాల కోసమే నెలకు రూ.25 వేల వరకు ఖర్చు చేస్తున్నాం.

? **గద్వాలలో** గ్రంథాలయ భవనం నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయి? ఎప్పుడు పూర్తవుతాయి?

✔ రూ.1.30 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు ఆగడం వల్ల పనులు నిలిచిపోయాయి. నిధుల సమీకరణ జరిగినప్పుడు పూర్తిచేయడానికి సహకారం ఉంటుంది.

? **కేంద్ర** గ్రంథాలయంలో మహిళలకు ప్రత్యేక గదుల కేటాయింపు ఏమైనా చేశారా? మహిళా, చిన్నారులకు ప్రత్యేకంగా ఏమైనా ఏర్పాట్లు చేస్తున్నారా?

✔ ప్రస్తుతానికి ఉన్న భవనంలోనే కొంత భాగాన్ని మహిళలకు కేటాయించి అందుబాటులో ఉంచాం. మహిళా, చిల్డ్రన్ లైబ్రరీల కోసం ఎలాంటి ప్రతిపాదనలు పంపించలేదు.

? **పాఠకులు** ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు?

✔ పాఠకులకు ఇక్కడ తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాం. మొబైల్ బ్రౌజింగ్ చేసుకోవడానికి ఉచితంగా ఇంటర్నెట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు: సీపీఎం

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి చివరి శ్వాస ఉన్నంత వరకు సీపీఎం కార్యకర్తలు పోరాటాలు చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శుక్రవారం ప్రారంభమైన సీపీఎం జిల్లా మూడో మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మతోన్మాదం, ఆర్థిక సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. గత దశాబ్దకాలంగా భాజపా ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. అన్ని వ్యవస్థల్లో రాజకీయ జోక్యం పెరిగి విజ్ఞానశాస్త్రం వెనకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలో అసమానతలు ఉండాలని కోరుకోవడం పెట్టుబడిదారీ విధానం సహజ లక్షణమన్నారు. దీనిని అర్థం చేసుకుని ప్రతి కార్యకర్తా దానికి వ్యతిరేకంగా పోరాట పంథాను నిర్ణయించుకోవాలన్నారు. మోహన్‌రావు, రామన్‌గౌడ్ మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, న్యాయవాదులు లక్ష్మణ్, మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు దేవదాసు, రాజు, వీవీ నర్సింహ, ఉప్పేరు నర్సింహ, ఈదన్న, నర్మద, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అర్హులందరికీ రుణమాఫీ అమలు చేయాలి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలు అమలుచేయడంతో వెనుకంజ వేస్తోందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ రంజిత్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం అర్హత ఉండీ రుణమాఫీ వర్తించని రైతులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఐడీవోసీ వద్దకు చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్, బ్యాంకు, పట్టాపాసు పుస్తకంలో చిన్న, చిన్న తప్పులు ఉన్నాయన్న సాకుతో అర్హులైన వారికి ఇంత వరకు రుణ మాఫీ జరగలేదన్నారు. వానాకాలం సీజన్ ముగిసి పంట ఉత్పత్తులు చేతికి వస్తున్న సమయంలో కూడా రైతు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెడుతున్నారని, ఆఖరుకు విద్యార్థులపై లాఠీచార్జి చేసే స్థితికి ప్రభుత్వం దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చేలా ప్రభుత్వానికి జిల్లా నుంచి నివేదిక ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందించారు. సంస్థ కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు లవన్న, వెంకట్రాములు, బలరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో నడిగడ్డ పోరాట హక్కుల సమితి నాయకులు, రైతులు

జలశక్తి అభియాన్ బృందం పర్యటన

ధరూరు, న్యూస్‌టుడే: ధరూరు, గట్టు మండలాల పరిధిలో ఉపాధి హామీ ఇతర పథకాల ద్వారా చేపడుతున్న జల సంరక్షణ పనులను జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఎల్లందొడ్డి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. జలసంరక్షణ ప్రయోజనాలను ప్రతినిధి మధుసూదన్ వివరించారు. అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, సాగునీటి శాఖ ఈఈ రహీముద్దీన్, ఎంపీడీవో చెన్నయ్య, తదితరులున్నారు.



ఎల్లందొడ్డిలో ప్రజలతో మాట్లాడుతున్న మధుసూదన్

ప్రభుత్వానికి పేరొస్తుందనే రాద్ధాంతం

గ్రూప్-I అభ్యర్థులను ప్రతిపక్షాలు రెచ్చగొట్టాయి : మంత్రి శ్రీధర్ బాబు

పాలమూరు,. న్యూస్‌టుడే : రాష్ట్రంలో రాత పరీక్ష నిర్వహించి గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న భయంతోనే ప్రతిపక్షాలు అభ్యర్థులను రెచ్చగొట్టాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండిపడ్డారు. మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలోని ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసే అధునాతన సాంకేతిక కేంద్రం(ఏటీసీ)కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాల ప్రకటన ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిందని, ప్రిలిమ్స్ పూర్తయి మెయిన్స్‌కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాక ప్రతిపక్షాలు కుట్రలు చేశాయని ఆరోపించారు. పరీక్షకు నాలుగు రోజుల ముందు నుంచి అభ్యర్థులతో ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేయించాయని ఆరోపించారు. 9 నెలల నుంచి రాని అనుమానం.. ఇప్పుడు ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. 2011లో తాము అధికారంలో ఉన్నప్పుడు వేసిన గ్రూప్-1 ప్రకటనతో అనేక మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో గ్రూప్-1 ప్రకటన ఇచ్చిందన్నారు. 500 పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. భారాస 10 ఏళ్లలో 40వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని, అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50వేల కంటే ఎక్కువ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత తమకు దక్కుతుందన్నారు. రాబోయే కాలంలో మరిన్ని ఉద్యోగ ప్రకటనలు ఇస్తామన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతలదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 65 ఐటీఐ కళాశాలలను రూ.2,300 కోట్ల నిధులు వెచ్చించి ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. టాటా సంస్థ సహకారంతో డిమాండ్ ఉన్న కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్, షాద్‌నగర్, మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేయెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నారాయణపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఇటీవల మరణించిన కాంగ్రెస్ నాయకుడు కల్లపు సతీశ్ దశదినకర్మ సందర్భంగా సీఎం ఉదయం 11 గంటలకు మద్దూరుకు చేరుకోని సతీశ్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. నిడ్జింత రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతంలు పరిశీలించారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికే వారి కోసం ప్రత్యేకంగా టెంట్ ఏర్పాటు చేస్తున్నారు. హెలిప్యాడ్ దగ్గర జిల్లా అధికారులతో పాటు 10 మంది వరకు మాత్రమే ఉండాలని ఎస్పీ నాయకులకు సూచించారు. ఆర్‌అండ్‌బీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్తు, అగ్నిమాపక, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎం వెళ్లే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. కడా అధికారి వెంకట్‌రెడ్డి, అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, ఆర్డీవో మధుమోహన్, కోస్గి సీఐ దశ్రునాయక్, ఏర్పాట్లను పరిశీలించారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులకు సూచించారు. శుక్రవారం ఐడీవోసీలోని తన ఛాంబర్‌లో వానాకాలం ధాన్యం సేకరణపై జిల్లా కొనుగోలు కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా, అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,300 మద్దతు ధర రైతులకు చెల్లించనున్నామన్నారు. జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా 59 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైతే మరికొన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ముందుగా రైతులకు టోకెన్లు జారీ చేసి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్డీవో రాంచందర్, డీసీవో స్వామికుమార్, మేనేజర్ విమల, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ తదితరులున్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

ఆవిష్కరణలకు అవకాశం ఇవ్వమా?

- ఇన్‌స్పైర్ మనక్‌కు 3,858 రిజిస్ట్రేషన్లు
- ప్రైవేటు పాఠశాలల ప్రాతినిధ్యం అంతంతే



జాతీయ స్థాయి ప్రదర్శనలో వరి ధాన్యం అరబెట్టే పరికరం పనితీరు వివరిస్తున్న విద్యార్థిని

న్యూస్‌టుడే, నారాయణపేట పట్టణం

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని వెలికితీసి ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏటా దేశ వ్యాప్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్, మనక్ ద్వారా విద్యార్థుల్లో సృజనకు పదును పెడుతోంది. మనిషి జీవితంలో నిత్యం ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపించే ప్రాజెక్టులను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన వాటిని జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలకు సైతం పంపుతారు. 2024-25 ఏడాదికి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని పలుమార్లు విద్యాశాఖ అవగాహన కల్పించినా చాలా మంది ముందుకు రాలేదు. ప్రైవేటు పాఠశాలల నుంచి కనీస స్పందన కొరవడుతోంది. కేవలం నాలుగు ప్రైవేటు పాఠశాలలే ఇందులో పాల్గొన్నాయని, ఎన్ని ఎక్కువ పాఠశాలలు ప్రాతినిధ్యం వహిస్తే అంత మేలు జరుగుతుందని నారాయణపేట జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

2024 - 25లో నామినేషన్లు ఇలా..

జిల్లా	నామినేషన్లు
మహబూబ్‌నగర్	1061
వనపర్తి	1041
నాగర్‌కర్నూల్	847
గద్వాల	595
నారాయణపేట	315

తయారీ ఖర్చులకు రూ. 10 వేలు : అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు గైడ్ టీచరు సహాయంతో ప్రాజెక్టు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను పంపించాలి. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలో రూ. 10 వేలు జమ చేస్తారు. ఈ నిధులతో ప్రాజెక్టు తయారు చేసి జిల్లా స్థాయిలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇక్కడ ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన : జాతీయ స్థాయికి ఎంపికైన వారికి రూ.25 వేల ప్రోత్సాహకం అందజేస్తారు. అక్కడ ప్రతిభ చాటితే రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే విందు భోజనానికి హాజరయ్యే అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టుకు పేటెంట్ హక్కు కల్పిస్తారు. వీరికి దేశంలో పేరున్న ఐఐటీల్లో ప్రవేశాలకు రిజర్వేషన్ కల్పిస్తారు. అలాగే జపాన్ సందర్శనకు అవకాశం ఇస్తారు.

ఉమ్మడి జిల్లా నుంచి...: 2022-23 విద్యా సంవత్సరంలో నారాయణపేట నుంచి రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. అచ్చంపేట సాయినగర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అంజలి తయారు చేసిన ప్రాజెక్టు కూడా ఎంపికయ్యింది. వీరికి ప్రశంసలు వెల్లువెత్తాయి. 2023-24 లో ఎంపికైన ప్రాజెక్టులను ఈ ఏడాది ప్రదర్శనలకు ఉంచనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా 66, వనపర్తి 54, మహబూబ్ నగర్ 5, జోగులాంబ గద్వాల 44, నారాయణపేట నుంచి 18 ప్రాజెక్టులు వివిధ స్థాయిలకు ఎంపికయ్యాయి.

వేతనాలు లేక వెతలు

● మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికుల పరేషాన్

● పండగ వేళ అవస్థలు



పెద్దకొత్తపల్లిలో తెల్లవారుజామునే బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు

న్యూస్‌టుడే, కొల్లాపూర్ గ్రామీణం, కల్వకుర్తి : పల్లెల పరిశుభ్రతకు కీలకమైన పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలందడం లేదు. రెండు నెలలుగా అప్పులతో కాలం వెళ్లదీస్తున్నారు. దసరా పండగకు వేతనాలు రాకపోగా కనీసం దీపావళికైనా వస్తాయోనన్న ఆశతో కార్మికులు ఉన్నారు. సకాలంలో రాకుంటే పండుగకు పస్తులుండాల్సిందేనా అని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

● గ్రామపంచాయతీలకు ప్రస్తుతం నిధులు కూడా సరిగా రావటం లేదు. ఒప్పంద కార్మికులుగా నియమించుకున్నప్పటికీ పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా వేతనాలు అందడం లేదు. పంచాయతీల్లో పన్నుల వసూలు అంతంతమాత్రంగానే ఉంటోంది. దీంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. నిత్యం శ్రమకోర్చి రహదారులు ఊడ్చటం, చెత్త తొలగింపు, మురుగు కాల్వల శుభ్రత వంటి పనులు చేపట్టడుతున్నా.. కార్మికులను విస్మరిస్తున్నారు. నిత్యం ఉపాధి హామీపనులకు హాజరైనా నెలకు దాదాపు రూ. 6వేలకు పైగానే అందుకునే వీలుంది. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం విధులకు వెళ్తున్నా సకాలంలో వేతనాల అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 7,420 మంది పారిశుద్ధ్యకార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గత జులై వరకే వేతనాలు అందించారు. ఆగస్టు నుంచి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదు.

కార్యదర్శులపై ఒత్తిడి : రెండు నెలలుగా పంచాయతీలకు కూడా నిధులు సరిగా రావడంలేదు. దీంతో పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణ, డీజిల్ కొనుగోలు, ఇతర ఖర్చులతోడై పంచాయతీలు అప్పుల కుప్పగా మారుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీలు 550 దాకా ఉన్నాయి. వీటి నిర్వహణ మరింత భారంగా మారింది. కొన్ని చోట్ల కార్యదర్శులు అప్పులు తెచ్చి పారిశుద్ధ్య కార్మికుల చేతి ఖర్చులకు ఇస్తున్నారు. ప్రస్తుతం సర్పంచులు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులపై ఒత్తిడి పెరిగింది. నిధులు లేక వేతనాలు ఇవ్వలేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం పంచాయతీలు	1,684
పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు	7,420
మూడు నెలల వేతన బకాయిలు	రూ.14.09 కోట్లు

నిత్యం అప్పులతో..: రెండు నెలలుగా వేతనాలు లేక అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. గ్రామాల్లో పెద్ద పండుగ దసరా మా ఇళ్లల్లో చిన్నబోయింది.. దీపావళి కూడా జరుపుకొనే పరిస్థితి కన్పించడంలేదు. సరకులు కొందామన్నా ఆర్థిక ఇబ్బందులతో మా పరిస్థితి దయనీయంగా ఉంది.



- రాజేందర్, పెద్దకొత్తపల్లి పారిశుద్ధ్య కార్మికుడు

ఒక నెల సర్దుబాటు చేస్తాం..: పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఒక నెల వేతనాల నిధులు మంజూరయ్యాయి. వీటిని అందించేందుకు ఇప్పటికే ఆయా మండలాలకు వివరాలు పంపాలని సూచించాం. నివేదికలు రాగానే ప్రస్తుతానికి ఒక నెల వేతనాలు అందిస్తాం. - రామ్మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, నాగర్‌కర్నూల్

భావి తరం నిర్మాతలు మీరే

నవ, యువ గురువులారా.. అహర్నిశలు శ్రమించి.. పోటీని తట్టుకుని నిలబడి ఉత్తమమైన ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. భావి పౌరులను తీర్చిదిద్దే సువర్ణ అవకాశం మీ చేతుల్లోకి వచ్చింది. ఇతర శాఖల్లోని ఉద్యోగాలను సైతం వదులుకుని వచ్చిన వారూ మీలో ఉన్నారు. మనచుట్టూ ఉండే ఎంతోమంది గురువుల నుంచి అనుసరించిన పద్ధతులను మీరూ అలవరుచుకోవచ్చు. జీతం కోసమే ఉద్యోగం కాదు.. ఎన్నో జీవితాలను బాగుచేసే యజ్ఞం చేస్తున్నారని గుర్తించండి.

- న్యూస్‌టుడే కోస్గి, గద్వాల న్యూటౌన్

బడి బాట పట్టించండి

ఎంతో మంది చిన్నారులు వివిధ కారణాలతో బడి మానుకుంటున్నారు. కొందరు తల్లిదండ్రులతో వలస పోతే, మరి కొందరు పనులకు వెళ్తున్నారు. తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ బడికి పంపేలా ఒప్పించాలి.



హన్వాడలో పిల్లలను బడిబాట పట్టిస్తున్న ఉపాధ్యాయులు

● **ఉదాహరణ:** హన్వాడ పాఠశాలలో పనిచేస్తున్న జయప్రద ప్రతి వారం విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేలా ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నారు. పిల్లల ఇంటికి వెళ్లి తల్లి దండ్రులను ఒప్పించి బడికి పంపేలా చూస్తున్నారు.

కృత్యాధార బోధన

మామూలుగా చెప్పేదాని కన్నా కృత్యాలతో చేసి చూపిస్తే పిల్లల మనసుల్లో నాటుకుంటుంది. అందుకు కావలసింది ఓపిక, సృజనాత్మక ఆలోచనలే.

● మహబూబ్‌నగర్ జిల్లా వేపూర్‌లో పనిచేస్తున్న దశరథరాంరెడ్డి కృత్యాలతో ఆకట్టుకుంటున్నారు. ఒక్కొక్క తరగతికి భిన్న నమూనాలు అమలు చేస్తున్నారు. ధన్వాడ, చిన్నపొర్ల పాఠశాలల్లో అక్షరమాలలు, అట్టపెట్టలతో చతుర్విధ ప్రక్రియలను తయారు చేసి ఉపాధ్యాయులు ఔరా అనిపించారు.



వేపూర్‌లో విద్యార్థులతో మమేకమై బోధిస్తున్న దశరథరాంరెడ్డి

మంచి అలవాట్లు నేర్పించాలి

గురువులు ఏది అనుసరిస్తే విద్యార్థులు ఆ మార్గంలో పయనిస్తారు. ఎంతోమంది గొప్ప వ్యక్తులు తమ జీవితాలపై పాఠశాలలో గురువుల ప్రభావం ఉందని చెబుతారు. బాల్యదశలో మంచి అలవాట్లు నేర్పిస్తే పిల్లలు ఉన్నతంగా ఎదుగుతారు.

● **ఉదాహరణ:** ఊట్కూరు మండలం చిన్నపొర్ల పాఠశాలలో పనిచేస్తున్న నరేందర్ పిల్లలకు చదువు తప్ప ఇతర పనులు చెప్పకుండా తల్లిదండ్రులను చైతన్యపరిచారు. ఉదయం ఐదు గంటలకు లేచి చదువుకునేలా ప్రోత్సహించారు. ఇంతకు ముందు తాను పనిచేసిన మందిపల్లితండాలో 22 మంది విద్యార్థులను గురుకుల పాఠశాలకు ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. వ్యక్తిగత పరిశుభ్రత, క్రమ శిక్షణ విలువ నేర్పారు.



చిన్నపొర్లలో బోధిస్తున్న నరేందర్


సామాజిక బాధ్యత చెప్పాలి

భవిష్యత్తు బాధ్యత వారిదే అనే విధంగా విద్యార్థులను సమాయత్తం చేయాల్సిన అవసరం ఉంది. విలువలు, సామాజిక బాధ్యత చెప్పాలి.

● వనపర్తి జిల్లా యాపర్ల ఉన్నత పాఠశాలలో శంకర్ గౌడ్ ఆమ్మనూరులు నిత్యం పాఠశాలకు వచ్చి పాఠశాలకు రావాలని చిన్నారులకు సూచిస్తూ అలవాటుగా మార్చారు. బాల్య వివాహాలను అడ్డుకొని పోలీసులతో కలిసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కోస్గి మండలం ముశ్రీఫా జడ్పీ ఉన్నత పాఠశాలలో వార్ల మల్లేశం ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పక్షిజాతుల సంరక్షణ వంటి పనులను ప్రత్యక్షంగా పిల్లలతో చేయిస్తున్నారు.



బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న శంకర్



ఇటీవల డీఎస్సీలో ఎంపికై కొత్తగా 951 మంది ఉపాధ్యాయులు ఉమ్మడి జిల్లాకు వచ్చారు. .

జిల్లా	ఎస్ఏ	భాషా పండితులు	పీఈటీ	ఎస్జీటీ	స్పెషల్ ఎడ్యుకేషన్
మహబూబ్‌నగర్	35	22	07	144	06
నాగర్‌కర్నూల్	66	13	02	129	0
జోగులాంబ గద్వాల	34	26	08	77	04
నారాయణపేట	70	22	01	154	05
వనపర్తి	55	08	06	52	05

వృత్తికి న్యాయం చేయాలి

వృత్తికి కట్టుబడి ఉండాలి. ఎంతో నమ్మకంతో గురువుల చేతిలో పిల్లలను పెడతారు. తాను చేస్తున్నది ఉద్యోగం కాదని, సమాజ నిర్మాణంలో భాగస్వామ్యమని గుర్తించాలి.

● నాగర్‌కర్నూల్ జిల్లా చిన్నముద్దునూర్ పాఠశాలలో రాజశేఖర్‌రావు ఈ విషయంలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ఈయన ప్రతి పిల్లాడిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి ఎదిగేలా చూస్తున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకుంటున్న రాజశేఖర్ రావు

ఆట,పాటలకు ప్రాధాన్యం



విద్యార్థులకు సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తున్న భూపని గోపాలం

పిల్లలకు ఆటలు దూరం కావడంతోనే నేడు ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయి. విద్యార్థుల్లో శారీరక ధృడత్వం ఉంటే వారు ఇష్టంగా చదువుపై ఆసక్తి కనబరుస్తారు.

● మక్తల్‌కు చెందిన భూపని గోపాలం పనిచేసిన సమయంలో ఎంతోమందిని తీర్చిదిద్దారు. పదవీ విరమణ తరువాత వచ్చిన డబ్బుతో పేదపిల్లలను క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. జాతీయ స్థాయికి 62 మంది వెళ్లగలిగారంటే ఆయన నిబద్ధతను ప్రశంసించాల్సిందే. క్రీడాపాఠశాలకు 42 మంది విద్యార్థులు ఎంపికకావడానికి ప్రత్యేక శిక్షణ అందించారు. క్రీడాకారులకు తన సొంతడబ్బులతో పాటు దాతల నుంచి సేకరించిన నగదుతో అన్ని వసతులు సమకూర్చుతున్నారు.

ఇథనాల్ కంపెనీ సందర్శనను అడ్డుకున్న పోలీసులు



గుండ్లంపల్లి గ్రామస్థులను అడ్డుకున్న మరికల్ పోలీసులు

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన ఇథనాల్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న గుండ్లంపల్లి గ్రామస్థులు నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ ఇథనాల్ ప్రాజెక్టును, పరిసర గ్రామాలను సందర్శించడానికి శుక్రవారం వచ్చారు. వంద మంది రెండు బస్సుల్లో వచ్చారని తెలుసుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున మరికల్ పోలీసు స్టేషన్ వద్ద బస్సులను నిలిపేశారు. సందర్శనకు ఎలాంటి అనుమతి లేదంటూ బస్సుల్ని వెనక్కి మళ్లించి పోలీసు సహాయంతో జడ్చర్ల వరకు తీసుకెళ్లి వదిలేశారు. ఈ సంఘటనపై చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ పర్యటనను అడ్డుకోవడం ఏమిటని ప్రజాసంఘాల నాయకులు ఎం.రాఘవచారి, డి.చంద్రశేఖర్, ఎస్ఎం ఖలీల్, జె.చక్రవర్తి ప్రభుత్వాన్ని నిలదీశారు. పాలకులు మారినా పరిస్థితి మారలేదన్నారు. రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పట్టుదలతో సాధన చేస్తే విజయం తథ్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో సాధన చేస్తే తప్పక విజయం వరిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 క్రీడలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రీడాసాధన చేస్తే శారీరకంగా, మానసింగా దృఢంగా ఉంటారని దాని వల్ల జీవితంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నా తట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మొత్తం 16 పాఠశాలల నుంచి 540 మంది క్రీడాకారులు పోటీ పడినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, కాలుష్య నియంత్రణా మండలి సభ్యుడు బాలాజీసింగ్, ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామోపాధ్యాయురాలు సింధు, ఫుట్‌బాల్ అసోషియేషన్ సభ్యుడు కేశవులు, కౌన్సిలర్‌లు బాలునాయక్, రవిందర్, నాయకులు సురేందర్‌రెడ్డి, సతీష్, సీఐ నాగార్జున పాల్గొన్నారు.



కల్వకుర్తి జట్టుకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

క్రీడ	విజేత	రన్నర్
కబడ్డీ	కల్వకుర్తి	తాడూర్
వాలీబాల్	కల్వకుర్తి	నర్వ
ఖోఖో	కల్వకుర్తి	ఉయ్యాలవాడ
చెస్	కల్వకుర్తి	వేపూర్
క్యారం	హన్వాడ	వెల్టూర్

విజేతలు వీరే..

మూడు రోజుల పాటు జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు హోరాహోరీగా జరిగాయి. అత్యధిక క్రీడల్లో కల్వకుర్తి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓరల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు.

బాలిక మృతిపై అనుమానాలెన్నో...!

ప్రభుత్వ వ్యవస్థల తీరుపై విమర్శలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్యలో అనేక అనుమానాలు, పలు కోణాలు వెలుగుచూస్తున్నాయి. దొంగతనం జరిగింది గద్వాలలో అయితే మల్దకల్ పోలీసుస్టేషన్‌లో ఎలా విచారించారనే దానికి సమాధానం దొరకడం లేదు. దొంగతనం, పోలీసుల విచారణ భయంతో అవమానంగా భావించి బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి కర్నూల్ ఆసుపత్రిలో మృతిచెందిన విషయం తెలిసిందే. బాలిక ఆత్మహత్యకు యత్నించిదనే విషయం బహిర్గతం కావడంతో తొలుత కార్మిక శాఖ, ఆ తరువాత జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలు స్పందించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆయా శాఖల్లో స్పందన లేదు. దీనిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు విచారణ, కేసులు అంటున్నారు తప్పితే బాలికకు చట్టబద్ధంగా సంక్రమించిన హక్కులను విస్మరించారని పలువురు మహిళా సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. బాలికపై దొంగతనం అభియోగం మోపిన వెంటనే మైనర్లను పనిలో ఎలా పెట్టుకున్నారని ప్రశ్నించి ఉంటే ఈ రోజు బాలిక మృతిచెంది ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దిశగా పోలీసులు ఎందుకు విచారణ చేపట్టలేదనే విషయం వెలుగులోకి రావాల్సి ఉంది. గత కొంత కాలంగా జిల్లాలో అధికార వ్యవస్థలు నాయకుల పలుకుబడి ముందు చట్ట నిబంధనలు పనికి రానివిగా చేస్తున్నారని న్యాయనిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నూల్ ఆసుపత్రికి వెళ్లాం: బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిన వెంటనే కమిటీ సభ్యులం కర్నూల్‌లో చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లాం. అప్పటికే బాలిక అపస్మారక స్థితిలో ఉంది. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగాం. వారు ఏమీ చెప్పలేమనడంతో వివరాలు నమోదు చేసుకుని తిరిగి వచ్చాం.

-సుధారాణి, జిల్లా సంక్షేమ అధికారిణి

29న ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లను ఈనెల 29న జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి శుక్రవారం తెలిపారు. బోనఫైడ్, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్‌తో ఉదయం 9గంటలకు కోచ్ ఖలీల్‌ను నివేదించాలని సూచించారు.

పోటీలే లక్ష్యంగా ఆడండి

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అంతర్ జిల్లాల అండర్-23 క్రికెట్ టోర్నీలో సత్తా చాటితే తప్పక రంజీ స్థాయికి ఎదగవచ్చని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎండీసీఏ క్రికెట్ మైదానంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ మూడో రోజు నాగర్‌కర్నూల్- వనపర్తి మధ్య నిర్వహించిన వన్డే మ్యాచ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటితే తప్పకుండా తుది జట్టులో చోటు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు టి.సురేశ్ కుమార్, అశోక్, సభ్యులు గోపాలకృష్ణ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



జట్లతో క్రికెట్ సంఘం ప్రతినిధులు

నాగర్‌కర్నూల్ విజయం: అండర్-23 అంతర్ జిల్లాల టోర్నీలో నాగర్‌కర్నూల్ జట్టు వనపర్తి జట్టుపై 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన నాగర్‌కర్నూల్ జట్టు 44.2 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌట్ అయింది. తరుణ్ 35, సాయిరాం 19, కృష్ణ 18 పరుగులు చేశారు. వనపర్తి బౌలింగ్‌లో ఛత్రపతి 4, దినేశ్, ప్రణీత్ రెడ్డి చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం వనపర్తి జట్టు 31 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌట్ అయింది. అభిషేక్‌గౌడ్ 56, ప్రణీత్ 34 పరుగులు చేశారు. నాగర్‌కర్నూల్ నుంచి అభినవ్ 4, జశ్వంత్ 2 వికెట్లు తీశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



అండర్ 17 ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన పాత మక్తల్ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న వనపర్తి జిల్లా బీసీ గురుకుల కన్వీనర్ మేఘూరావు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఎంజేపీ సొసైటీ ఏటా వారికి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తోందని వనపర్తి జిల్లా బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ మేఘూరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-17 క్రీడా పోటీల విజేతలకు ప్రిన్సిపల్ గురువయ్యాగౌడ్‌తో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా మక్తల్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు నిలిచారు. మక్తల్ గురుకుల పాఠశాల విద్యార్థి జి.శివ వ్యక్తిగత ఛాంపియన్ షిప్ బహుమతి అందుకున్నారు. కబడ్డీలో ప్రథమ స్థానంలో నవాబ్‌పేట గురుకుల పాఠశాల, ద్వితీయ స్థానంలో మక్తల్, ఖోఖోలో నవాబ్‌పేట ప్రథమ, ద్వితీయ చిట్యాల, వాలీబాల్‌లో మక్తల్ ప్రథమ, సీసీ కుంట ద్వితీయ, టెన్నికాయిట్‌లో చిట్యాల ప్రథమ, ద్వితీయ బూర్గుపల్లి గురుకుల పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. చదరంగం పోటీల్లో కడుకుంట్ల ప్రథమ, కేటీ దొడ్డి ద్వితీయ, క్యారమ్స్‌లో సింగోటం ప్రథమ, కడుకుంట్ల ద్వితీయ, డిస్క్ త్రోలో మంజునాథ్ ప్రథమ (ధర్మాపూర్), ద్వితీయ డి.జయంత్ (చిట్యాల), షాట్‌పుట్‌లో ప్రథమ పి.రవీందర్ (చిట్యాల), ద్వితీయ వినయ్ (మక్తల్), హైజంప్, లాంగ్‌జంప్‌లో ప్రథమ కె.అఖిల్‌గౌడ్ (కేటీ దొడ్డి), ద్వితీయ జి.శరత్ (కల్వకుర్తి) నిలిచారు. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ప్రథమ స్థానంలో అంబటి పల్లి గురుకుల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో మక్తల్ విద్యార్థులు, 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో జి.శివ(మక్తల్), ద్వితీయ స్థానంలో చందు (చిట్యాల), 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ జి.శివ (మక్తల్), ద్వితీయ జి.శరత్ (కల్వకుర్తి), 3 కి.మీ. ప్రథమ కార్తిక్ (అంబటిపల్లి), ద్వితీయ వంశీ (నవాబ్‌పేట), 100 మీటర్లలో ప్రథమ భీముడు (అంబటిపల్లి), ద్వితీయ జి.శివ (మక్తల్), 200 మీటర్లలో ప్రథమ జి.శివ (మక్తల్), ద్వితీయ శరత్ (కల్వకుర్తి), 400 మీటర్లలో ప్రథమ శరత్ (కల్వకుర్తి), ద్వితీయ జి.శివ (మక్తల్) నిలిచారు.

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి, ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త మండలి

వేలం పాటలతో ఆలయాలకు రూ.3.35 కోట్ల ఆదాయం

సభ్యుల సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. మొత్తం రూ.3,35,82,000 ఆదాయం వచ్చినట్లు ఈవో వెల్లడించారు. గతేడాది రూ.1.76 కోట్లతో పోలిస్తే ఈ సారి దాదాపు రెట్టింపు వచ్చినట్లయింది. వేలం పాటలో 40 మందికి పైగా పాల్గొన్నారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి వేలంపాట అత్యధికంగా రూ.1.27 కోట్లు పలికింది. వాహన పార్కింగ్ రూ.77 లక్షలు, చీరలకు రూ.91 లక్షలు, ఫొటోలు, క్యాసెట్లు, పుస్తకాలకు రూ.22 లక్షలు, దేవస్థాన వసతి భవన నిర్వహణకు రూ.9.50 లక్షలు, శౌచాలయాల నిర్వహణకు రూ.7.20 లక్షలు, క్యాంటిన్ నిర్వహణకు నెలకు రూ.76 వేలకు పాటదారులు పాడుకున్నారు. పాట దక్కించుకున్న వారు నవంబరు 24వ తేదీలోగా 50 శాతం డబ్బులు చెల్లించి డిసెంబరు 1వ తేదీ నుంచి ఆలయాల వద్ద విక్రయాలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఈవో వివరించారు.



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయానికి ..

పదర(అమ్రాబాద్), న్యూస్‌టుడే : మద్దిమడుగు శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో కొబ్బరికాయల విక్రయం వేలం మహబూబ్‌నగర్‌లోని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అచ్చంపేటకు చెందిన వ్యాపారి నర్సిరెడ్డి రూ.48 లక్షలకు వేలం దక్కించుకున్నారు. అయితే గతేడాది రూ.40.52 లక్షలు పలికింది. కొబ్బరి చిప్పలు, తలనీలాల సేకరణకు సరైన వేలం రాకపోవటంతో వాయిదా వేశారు. త్వరలో మరో తేదీని ఖరారు చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈవో రంగాచారి, పాలక మండలి ఛైర్మన్ రాములు నాయక్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	115–00
రిటైల్	137–00
డ్రెస్డ్	199–00
స్కిన్‌లెస్	226–00

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

గద్వాల గ్రామీణం : 9052211532 | అలంపూర్ : 8008573916
అయిజ : 8008573922 | అలంపూర్ పట్టణం : 8008573930

సమస్య : రాజోలి గ్రామంలో కొత్తగా మగ్గాలు వేసుకొని జీవనం సాగిస్తున్న వారికి జియోట్యాగ్ నంబర్లు ఇవ్వడం లేదు. దీనివల్ల పథకాల లబ్ధిపొందలేకపోతున్నాం.
–బాష, రాజోలి

సమాధానం: గతంలో యాప్ ద్వారా నమోదు చేసుకున్న వాటిని ఉన్నతాధికారులు అనుమతించడం లేదు. అప్పుడు నమోదు చేసిన వారు ఇప్పుడు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి వీలైనంత తొందరగా జియోట్యాగ్ నంబర్ అందేలా చూస్తాం. –గోవిందయ్య, ఏడీ, గద్వాల

- న్యూస్‌టుడే, రాజోలి

తెరపై ఈనాడు

గద్వాల: ఎస్వీసీ సినిమాస్.. **దేవర, విశ్వం, జనక అయితే గనక, లగ్గం, వీనమ్, అయిజ:** శివసాయి : **దేవర**
భువనేశ్వర్ : **సముద్రుడు,** మాధవ్ : **పొట్టేల్**
– న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

కలెక్టర్‌ను కలిసిన గెజిటెడ్ అధికారులు



కలెక్టర్ సంతోష్‌తో గెజిటెడ్ అధికారులు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) కమిటీ సభ్యులు కలెక్టర్ సంతోష్‌ను శుక్రవారం ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులతో కలెక్టర్ పలు అంశాలు ముచ్చటించారు. అనంతరం జిల్లాలో కొత్తగా ఏర్పాటైన సంఘం సభ్యులు కలెక్టర్‌ను సన్మానించారు. జిల్లా అధ్యక్షులు రహీముద్దీన్, కార్యదర్శి శశిధర్‌రెడ్డి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ వెంకటరాజారెడ్డి తదితరులున్నారు.

వస్తే భగీరథ.. లేదంటే నీటిసీసా

పాఠశాలల్లో తాగునీటికి తప్పనితిప్పలు

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన



మానవపాడు: మండలం జల్లాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనం తయారు చేసేందుకు వినియోగించేందుకు, తాగేందుకు ట్యాంకులో ఉంచిన నీటిలో పేరుకున్న మట్టిని చూడొచ్చు. చండూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గతేడాది నుంచి మిషన్ భగీరథ నీళ్లు లేక దాదాపు 20 మంది విద్యార్థులు ఇంటి నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.



ఇటిక్యాల: మండలం వల్లూరు పాఠశాలలో 105 మంది విద్యార్థులున్నారు. ఒకే డ్రమ్‌లో మిషన్ భగీరథ నీటిని ఉంచుతున్నారు. దీంతో విద్యార్థులు దాహం తీర్చుకునేందుకు కొంత సమయం నిరీక్షించాల్సి వస్తోంది. నీటి సరఫరా నిలిచిపోతే బాటిళ్లే దిక్కవుతున్నాయి. వావిలాల ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి కింద పనులు పూర్తి చేసిన గుత్తేదారు మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రాథమిక పాఠశాల నీటిని వాడుకోవాల్సిన పరిస్థితి ఉంది.



ఉండవల్లి: పుల్లూరు ప్రాథమిక పాఠశాలలో నీళ్ల సీసాలు తెచ్చుకుని భోజనం చేస్తున్న విద్యార్థులను చిత్రంలో చూడొచ్చు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో 22 ప్రభుత్వ పాఠశాలల్లో 2,528 మంది విద్యార్థులున్నారు. అన్ని పాఠశాలలకు మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నా విద్యార్థులు ఇంటి నుంచే నీళ్ల సీసాలు తెచ్చుకుంటున్నారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతపై నమ్మకంలేకే ఇంటి నుంచి నీళ్ల సీసాలను పంపిస్తున్నామని తల్లిదండ్రులు అంటున్నారు.



ఇటిక్యాల మండలం కొండేరులో..

ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు నీటిని తాగేందుకు అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరే సరఫరా చేస్తున్నారు. కొన్ని పాఠశాలలకు పైప్ లైన్లు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం, నీరు ఒక్కోరోజు సరఫరా కాకపోవడం తదితర కారణాలున్నాయి. భగీరథ నీటి నాణ్యత సక్రమంగా లేదంటూ చాలా మంది విద్యార్థులు ఇంటివద్ద నుంచి సీసాల్లో తాగునీటిని తెచ్చుకుంటున్నారు.

అయిజ: మండలంలో సింధనూరు, కొత్తపల్లి, పులికల్, కుట్కనూరు తదితర పాఠశాలల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సింధనూరు ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 239 మంది విద్యార్థులున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదు. దీంతో రోజుకు రూ.200 వెచ్చించి శుద్ధ జలాన్ని తెప్పిస్తున్నామని, హెచ్.ఎం భద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇక వంట చేయడానికి బోర్‌లోని ఉప్పునీటిని వినియోగిస్తున్నారు. గ్రామస్థులు సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలో 30 పాఠశాలలున్నాయి. వీటిలో 5,230 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తనగల, రామాపురం, పైపాడు, బుడమర్సు, జక్కిరెడ్డిపల్లి, జూలకల్, కొంకల, వడ్డేపల్లి పాఠశాలల్లో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

అలంపూర్: మండల పరిధిలో 7 ఉన్నత, 5 ప్రాథమికోన్నత, 19 ప్రాథమిక పాఠశాలలున్నాయి. 2,520 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాని రోజు విద్యార్థులకు, వంట చేసే వారికి అవస్థలు తప్పడంలేదు. తరచూ పట్టణానికి నీరు అనుకున్నంత మేరకు సరఫరా కావడంలేదు. కొన్ని విద్యాలయాల్లో నీటి నిల్వ సంపులను సక్రమంగా శుభ్రం చేయడంలేదనే ఆరోపణ ఉంది.



రాజోలి: మండలంలోని తుమ్మిళ్ల, రాజోలి న్యూప్లాట్స్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, టీ.గార్లపాడు పాఠశాలల్లో తాగునీటికి, చేతులు శుభ్రం చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. తుమ్మిళ్ల యూపీఎస్‌లో మొత్తం 280 మంది విద్యార్థులుంటే నది నుంచి నేరుగా సరఫరా అయ్యే ఒకే కుళాయి ఉంది. ఆ నీరు సరిపడక డ్రమ్ములో నిల్వ ఉంచుతున్నారు. క్లోరినేషన్ చేయని ఆ నీటినే విద్యార్థులను చిత్రంలో చూడొచ్చు.

జోగులాంబ గద్వాల పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలో పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 10న జీవో నం 173ను జారీ చేయగా శుక్రవారం ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. నలుగురు పాలక వర్గ సభ్యులు ఎంపిక చేసి 'జోగులాంబ గద్వాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' పేరుతో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీనికి ఛైర్మన్‌గా కలెక్టర్ సంతోష్ వ్యవహరించనున్నారు. ఆ అథారిటీ కింద జిల్లాలోని గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి పురపాలక సంఘాలతో పాటు 194 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.

మానసిక ఒత్తిడి జయిస్తేనే విజయం

ధరూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే మానసిక ఒత్తిడిని జయించాలని ప్రముఖ సైకాలజిస్టు ప్రదీప్ కుమార్ అన్నారు. శుక్రవారం గట్టు జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు భవిష్యత్తు జీవన ప్రమాణాలకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు.

సమయం సద్వినియోగంతోనే భవిష్యత్తు

శాంతినగర్, న్యూస్‌టుడే: సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యంతో ముందుకెళితే సాధించలేనిదేమీ లేదని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.వెంకటరమణ పేర్కొన్నారు. శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన పలు సమస్యలకు ఆయన పరిష్కారాలను సూచించారు. ప్రిన్సిపల్ డా.రమాఓబులేష్, వైస్ ప్రిన్సిపల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనం విజయవంతం చేయండి

శాంతినగర్, న్యూస్‌టుడే: హైదరబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 27న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగే ప్రత్యేక సదర్ సమ్మేళనం విజయవంతం చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి అమర్ యాదవ్ పిలుపునిచ్చారు. దీపావళి పర్వదినం సందర్భంగా ఈ ఉత్సవం చేసుకుంటామని, ప్రభుత్వం అధికారికంగా దీన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వారికి పరిహారమివ్వండి

ధరూరు : గట్టు మండలం రాయపురం వద్ద క్వారీలో భారత్‌మాల పనుల కోసం చేసిన బ్లాస్టింగ్‌ల కారణంగా గాయపడిన వారికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ అన్నారు. క్వారీలో పేలుళ్ల కారణంగా నాలుగు గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని ఆయన ఆరోపించారు. చికిత్స పొందుతున్న వారి వైపు కనీసం కంపెనీ ప్రతినిధులు కన్నెత్తి చూడటం లేదన్నారు. కంపెనీ ప్రతినిధులపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

యువకుడిని కాపాడిన మత్స్యకారులు



వ్యక్తిని ఒడ్డుకు తీసుకొస్తున్న మత్స్యకారులు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వ్యక్తి కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని మత్స్యకారులు కాపాడారు. సంఘటన శుక్రవారం సాయంత్రం బీచుపల్లి వద్ద చోటు చేసుకుంది. మండలంలోని మునగాల గ్రామానికి చెందిన యువకుడు కుటుంబ కలహాల కారణంగా మద్యం సేవించి, మత్తులో బీచుపల్లి వద్ద కృష్ణా నదిలో దూకేశాడు. గమనించిన మత్స్యకారులు నదిలో దూకి ఆ వ్యక్తిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. గ్రామస్థులకు సమాచారం అందించి వారికి అప్పగించారు.

కర్షక మిత్ర రుణాలు సద్వినియోగం చేసుకోండి



చెక్కులు అందజేస్తున్న డీసీసీబీ ఛైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి

ఇటిక్యాల, న్యూస్‌టుడే: కర్షక మిత్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ ఛైర్మెన్ ఎం. విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పుట్టాన్‌దొడ్డి సహకార సమితి నుంచి 7 మంది లబ్ధిదారులకు రూ.67,50,000 చెక్కులను పీఏసీఎస్ అధ్యక్షులు రంగారెడ్డితో కలిసి అందజేశారు. ఇప్పటి వరకు పీఏసీఎస్ నుంచి 26 మందికి రూ.202.59 లక్షలు అందించగా, డీసీసీబీ బ్యాంకు నుంచి మరో రెండు కోట్లు అందించినట్లు ఛైర్మెన్ తెలిపారు. దీంతో పాటు అక్టోబరు నెలలో పీఏసీఎస్ నుంచి రైతు రుణాలకు రూ.1.20 కోట్లు మంజూరు చేయగా ఇప్పటికే రూ. కోటి రైతులకు అందించినట్లు పీఏసీఎస్ అధ్యక్షులు తెలిపారు. ఈ నెలాఖరుకు రూ.20 లక్షలు కూడా అందించనున్నందున మరింత మంది రైతులకు రుణాలు అందించేందుకు అదనపు నిధులు కేటాయించాలని డీసీసీబీ ఛైర్మెన్‌ను కోరారు. నవంబరు నెలలో మరో రూ. కోటి మంజూరు చేస్తానని డీసీసీబీ ఛైర్మెన్ హామీ ఇచ్చారు. పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పుల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో భగీరథరెడ్డి

రాజోలి, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో పిల్లల జీవితాలు అంధకారం చేయొద్దని, వాటి నిర్మూలన అందరి బాధ్యతని తహసీల్దార్ రామ్మోహన్, ఎంఈవో భగీరథ రెడ్డి అన్నారు. శుక్రవారం రాజోలి ఎంఆర్సీ కార్యాలయంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి బాలల హక్కుల పరిరక్షణ వేదిక సమావేశం నిర్వహించి సమస్యలను చర్చించారు. బాల్య వివాహాల నిరోధానికి యువత, విద్యావేత్తల కృషి చాలా అవసరమన్నారు. ఎక్కడ జరుగుతున్నా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే బడిఈడు పిల్లలను పనికి పంపి వారి హక్కులకు భంగం కలిగించొద్దని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు నాణ్యమైన చదువుకు దూరమవుతున్నారని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. ఎంవీఎఫ్ మండల సమన్వయకర్త హన్మిరెడ్డి, సీఆర్పీఎఫ్ మండల కన్వీనర్ విక్రమసింహారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు రమేశ్ తదితరులున్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

అలంపూర్, న్యూస్‌టుడే: బైరన్‌పల్లి, గొందిమళ్ల గ్రామాల్లో శుక్రవారం పశువులకు వైద్యశిబిరం నిర్వహించారు. వ్యాధి నివారణ టీకాలు వేశారు. జిల్లా పశువైద్య, పశు సంవర్థక అధికారి పి.వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ 85 పశువులు, 196 గేదెలకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ యూ.ఆర్.రమేష్, వెంకట నారాయణ, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సంపు



చండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మిషన్ భగీరథ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇందుకు పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సంపు ప్రమాదకరంగా ఉంది. పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుతున్నారు. పిల్లలు ఆడుకునేటప్పుడు ప్రమాదవశాత్తు సంపులో పడితే గాయాలపాలయ్యే అవకాశం ఉంది. ఎంఈవో శివప్రసాద్‌ను గురువారం 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. –న్యూస్‌టుడే, మానవపాడు

ప్రహరీల్లేక అవస్థలు



అయిజ పట్టణంలోని దుర్గానగర్ ప్రాథమిక పాఠశాల ఇది. అయిజలోని భరత్‌నగర్, సంతబజారు, సంకాపురం, పులికల్, తుపత్రాల, దేవబండ, మేడికొండ, కిసాన్‌నగర్ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో పాఠశాలల్లోకి జంతువులు, క్రిమికీటకాలు వస్తున్నాయి. మరోవైపు సెలవు దినాల్లో పోకిరీలు, ఆకతాయిలు, దుండగులు పాఠశాలల్లోకి వెళ్లి వస్తువులను చిందరవందర చేస్తున్నారు. కిటికీలు, బల్లలు ధ్వంసం చేస్తున్నారు. ప్రహరీలు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, అయిజ

మలుపులో తెలిసేదెలా!



గద్వాల జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్‌పై నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీకి వెళ్లే మార్గంలో మలుపు ప్రమాదకరంగా మారింది. ఫ్లైవంతెన చివరలో సర్వీస్ రోడ్డు వైపు తిరిగే క్రమంలో మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు, జీబ్రా మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గద్వాల పట్టణం

తాగునీటి వృథాకు అడ్డుకట్ట



గద్వాల పుర పరిధిలోని గాంధీచౌక్ నుంచి కృష్ణారెడ్డిబంగ్లాకు వెళ్లే మార్గంలో తాగునీటి పైప్‌లైన్ లీకై ప్రధాన రహదారిపై నీరు వృథాగా పారుతోందని శుక్రవారం 'తాగునీటి వృథా' శీర్షికన 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. దీంతో పురపాలిక అధికారులు స్పందించి, వెంటనే సిబ్బందికి చెప్పి పైప్ లైన్ లీకేజీ కాకుండా ఇలా మరమ్మతులు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. –న్యూస్‌టుడే, గద్వాల పట్టణం

నిందితులను అరెస్టు చేయండి



అంతిమయాత్రలో పాడె మోస్తున్న రంజిత్‌కుమార్

మల్దకల్, న్యూస్‌టుడే: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక మృతికి కారకులైన వారిపై హత్యకేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాటసమితి ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్‌తో పాటు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బిజ్వారం గ్రామానికి వెళ్లి బాలిక మృతదేహంపై పూలమాలవేసి నివాళి అర్పించారు. రెండు నిముషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. తీవ్ర నిర్బంధాల మధ్య కుటుంబ సభ్యులను ఒత్తిడి చేసి అంత్యక్రియలు నిర్వహించడం దారుణమన్నారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకుల పాల్గొన్నారు.

'నేవీ రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకించండి'



గోడ పత్రికను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న నేవీ రాడార్ స్టేషన్ వల్ల అడవి నాశనం అవుతుందని, ఇదీ పర్యావరణ విధ్వంసానికి పాల్పడటం తప్ప మరేమీ కాదని సేవ్ దామగుండం అంటూ దానిని వ్యతిరేకించాలని ప్రజా సంఘాలకు చెందిన నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వాల్మీకి భవనంలో సేవ్‌ది దామగుండం పేరిట సగుణ, ప్రొఫెసర్ సాయిబాబాలను స్మరించుకుందాం అంటూ ముద్రించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి భవనంలో ఉదయం 10 గంటలకు సభను ఏర్పాటు చేశామని, విద్యార్థులు, కుల, కార్మిక సంఘాలు, మహిళలు, మేధావులు, పర్యావరణ వేత్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వహకులు కోరారు.


గద్వాలలో పర్యటించిన శిక్షణాధికారులు



సంగాల పార్కు వద్ద సివిల్ సర్వీసుల శిక్షణాధికారులు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాల పట్టణంలో శుక్రవారం వివిధ కేంద్ర సర్వీసులు ఐపీఎస్, ఐఎఫ్‌వోసీ, ఐసీఎల్ఎస్, ఐఎస్ఎస్, ఐడీఏఎస్, ఐటీఎస్ విభాగాల్లో శిక్షణలో ఉన్న అధికారుల ప్రత్యేక బృందం పర్యటించింది. ముందుగా పుర కార్యాలయాన్ని సందర్శించారు. ఆర్‌ఐ రాజేష్, మెప్మా అధికారులు వారిని ఆహ్వానించి సన్మానించారు. అనంతరం సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన లింగంబావి, చొక్కం బావి వంటి పురాతన నీటి మార్గాలను పరిశీలించి వాటి చరిత్రను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లోని వీధి వ్యాపారుల దుకాణాలను సందర్శించి బ్యాంకు ద్వారా వారికి అందిన రుణాల వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మెప్మా అధికారులు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇందిరా మహిళా శక్తి కింద గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన కర్రీ పాయింట్‌ను పరిశీలించారు. రాఘవేంద్ర కాలనీలోని చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి చీరలు తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. సంఘాల చెరువు వద్ద పురపాలక సంఘం నిర్మించిన పార్కును సందర్శించారు.

ఆలయాల సందర్శనలో..



పురావస్తు ప్రదర్శన శాలలో శిక్షణ అధికారులు

అలంపూర్, న్యూస్‌టుడే: శిక్షణ అధికారులు లోకేష్‌కుమార్ (ఐఎస్ఎస్), రామకృష్ణ శరణ్ (ఐపీఎస్), ప్రతీక్ గెహ్లోత్(ఐపీఎస్), అతుల్ కుమార్‌సింగ్ (ఐఆర్ఎస్ ఐటీ), హిమాన్షు త్యాగి (ఐఎఫ్ఓఎస్) శుక్రవారం అలంపూర్‌లోని పురాతన ఆలయాలను సందర్శించారు. ఇందులో భాగంగా సంగమేశ్వర ఆలయం, మ్యూజియం, తదితర ఆలయాలతో పాటు కృష్ణానదిలో పుట్టిలో విహరించారు. అలంపూర్‌లోని అన్ని ఆలయాల గురించి వివరాలు తెలుసుకున్నారు.

జిల్లా మహాసభలకు తరలిన నాయకులు



అలంపూర్ సీపీఎం నాయకులు

అలంపూర్, న్యూస్‌టుడే: గద్వాల నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలకు అలంపూర్ సీపీఎం నాయకులు తరలి వెళ్లారు. కమిటీ సభ్యులు రాజు, దేవదాసు, ఈదన్న, నరసింహ, వెంకటస్వామి, రహీం, అక్బర్ హాజరయ్యారు.

భారత్‌మాల గుత్తేదారులపై కేసు నమోదు

ధరూరు, న్యూస్‌టుడే: గట్టు మండల పరిధిలోని రాయపురం వద్ద క్వారీలో పేలుళ్ల చేసిన కారణంగా గాయపడిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భారత్‌మాల పనులు చేస్తున్న కంపెనీ ప్రతినిధులపై కేసు నమోదైంది. గట్టు ఎస్సై కేటి మల్లేశ్ కథనం మేరకు.. సల్కాపురం గ్రామానికి చెందిన హరిజన తిమ్మప్ప కుమారుడు నవీన్, మరదలు పద్మమ్మ రాయపురం సమీపంలో ఉన్న తమ సొంత వ్యవసాయ పొలంలో గురువారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పత్తి తీస్తుండగా సమీపంలో ఉన్న క్వారీలో పేలుళ్ల చేయటంతో బండరాళ్లు ఎగిసి పడి వారికి గాయపడిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం తిమ్మప్ప గట్టు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయటంతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిశ్రమ ఏర్పాటు

రాజోలి, న్యూస్‌టుడే: ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు విషయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని, వారి అభీష్టం ప్రకారమే ఏర్పాటు చేస్తామని గాయత్రీ కంపెనీ అనుసంధాన కర్త శ్రీనివాసులు, సైట్ ఇన్‌ఛార్జి చైతన్య ఒక ప్రకటనలతో తెలిపారు. పెద్దధన్వాడ వద్ద ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడ్డుకున్న నేపథ్యంలో వారు ఇది విడుదల చేశారు. త్వరలోనే ప్రజలతో సమావేశమై అవగాహన కల్పిస్తామని, ఇందులో అధికారులు, శాస్త్రవేత్తలను భాగస్వామ్యం చేసి అనుమానాలను నివృత్తి చేస్తామన్నారు.

పర్యవేక్షణతోనే నాణ్యమైన భోజనం



విద్యార్థులకు వండిన భోజనం పరిశీలిస్తున్న డీఈవో

ధరూరు న్యూస్‌టుడే: కస్తూర్బా పాఠశాలల్లో భోజన నాణ్యతపై ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ ఉండాలని జిల్లా విద్యాధికారి రవీందర్ సూచించారు. శుక్రవారం ధరూరు మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక వసతులపై పరిశీలించారు. విద్యార్థినులను అడిగి వసతులపై ఆరా తీశారు. సమస్యలు ఏవైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

సమగ్ర సర్వే సాధ్యమేనా?



పాన్‌గల్‌లో డిజిటల్ సర్వే (పాతచిత్రం)

కొత్తకోట, న్యూస్‌టుడే : భూ వివాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి వ్యవసాయ క్షేత్రానికి తప్పని సరిగా నక్షా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ధరణిలో అనేక అవకతవకలు జరిగాయని ఆర్వోఆర్-2024ను అమలులోకి తేవాలని యోచిస్తోంది. తాజాగా క్రయ విక్రయాలు జరిగే సమయంలో భూ నక్షా చిత్రం తప్పని సరి చేయాలని చూస్తోంది. ఈ క్రమంలో సర్వేయర్ల ఆవశ్యత పెరిగింది. ఇప్పటి వరకు వీరు పూర్తిస్థాయిలో లేక పోవడంతో గ్రామాల్లో భూ వివాదాలు జరుగుతున్నాయి. వాటికి పరిష్కారం దక్కక ధరణిలో చోటు లేకుండా వివాదాస్పదమవుతోంది. ఇలాంటి పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం సర్వే- భూదస్త్రాల విభాగాల పటిష్టతపై కసరత్తు ప్రారంభించింది.

వివాదాల పరిష్కారానికి.. జిల్లాలో నిజాం పాలనలో షెత్వార్ పేరిట 1938-45 మధ్య కాలంలో సర్వే నిర్వహించినట్లు తెలుస్తోంది. రెవెన్యూ గ్రామాల్లో పట్టాదారుల సమాచారంతో కాస్రా-పహాణి తయారు చేసి అందుబాటులో ఉంచింది. ప్రభుత్వం ఏర్పడ్డాక వాటినే కొలమానంగా రెవెన్యూ శాఖ పరిగణించింది. సమస్య ఏర్పడినప్పుడు విక్రయాలు జరిగి వివాదాలు తలెత్తిన సమయంలో భూ కొలతల శాఖ వద్ద ఉన్న 'టిపన్' (కొలతల పుస్తకం) రూపంలో కొనుగోలుదారుకు భూమిని అప్పజెబుతూ వస్తున్నారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న కాస్రా పహాణి ఆధారంగానే భూ దస్త్రాల ప్రక్షాళన కొనసాగించారు. తరచూ భూముల వివాదాలు అపరిష్కృతంగా కొనసాగుతున్నాయి. అలాంటి వివాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా భూసర్వే అంశం, నక్షా ఆధారంగానే రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుండటంతో సర్వేయర్ల ప్రాధాన్యత పెరిగింది.

జిల్లా	సాగు భూములు	గ్రామాలు	సర్వేయర్లు
మహబూబ్‌నగర్	4,44,853	441	13
నాగర్‌కర్నూల్	7,30,311	461	14
వనపర్తి	3,58,848	255	13
జోగులాంబ గద్వాల	4,47,427	255	7
నారాయణపేట	4,47,252	280	10

పూర్తిస్థాయిలో లేకనే..: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వేయర్ల కొరత కారణంగా భూముల కొలతలు రైతుల్ని వేధిస్తున్నాయి. ఆ శాఖలో కంప్యూటర్ డ్రాఫ్ట్‌మెన్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా ఏర్పడినప్పటి నుంచి కంప్యూటర్ విభాగంలో సిబ్బంది లేరు. గతంలో సర్వేయర్లు గొలుసుతో భూముల్ని కొలిచేవారు. సాంకేతికత పెరిగిన క్రమంలో డిజిటల్ యంత్రాలు ఉపయోగిస్తున్నారు. ఎత్తైన, లోతైన ప్రదేశాల కొలతకు డీజీపీఎస్ (డిఫ్రెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) యంత్రం సాయంతో కొలతలు వేస్తున్నారు.